క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

సాక్షి, భీమవరం: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 12.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం మార్కెట్, పోలీస్ బొమ్మ సెంటర్, మెంటేవారి తోట, శ్రీనివాస సెంటర్, వివేకానంద సెంటర్, కొత్త బస్టాండ్ ఏరియా, సీఎంఆర్ ఏరియా, మావుళ్లమ్మ గుడి ఏరియా, వీరమ్మ పార్కు ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంధన పొదుపుపై అవగాహన

భీమవరం (ప్రకాశం చౌక్): మిషన్‌లైఫ్ భాగంగా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఆర్టీఓ టి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో భీమవరంలో సోమవారం ఇంధన పొదుపు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పడినపుడు, రైల్వే గేట్లు మూసినపుడు వాహనాల ఇంజన్ ఆఫ్ చేసి ఇంధనాన్ని పొదుపు చేయాలన్నారు. తద్వారా పర్యావరణ రక్షణకు తమవంతు బాధ్యత నిర్వర్తించిన వారవుతారని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ దాసు, మోటర్ వెహికల్స్‌ఇన్‌స్పెక్టర్స్, మినిస్టీరియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

స్పందనలో 7 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఏడు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.ఎస్.శ్రీకర్ సోమవారం చెప్పారు. కుప్పనపూడి ఆయకట్టుకు నీరందించే అజ్జమూరు చానల్‌కు వెంకయ్య వయ్యేరు కాల్వ వద్ద డ్యామ్ విరిగిపోయిందని, బాగుచేయించాలని రైతులు వినతిపత్రం అందజేశారు. స్థానిక దొరగారి చెరువును అభివృద్ధి చేయాలని, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు.

మాలమహానాడు సమావేశం

భీమవరం అర్బన్: తెలంగాణలో దళిత బంధు పేరుతో రూ.10 లక్షలు ఇస్తున్నారని, మన రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. నరసింహపురంలో సోమవారం మాలమహానాడు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దళితుల అభివృద్ధిపై చర్చించారు. అనంతరం నియోజకవర్గ కార్యదర్శిగా నక్కా సువర్ణరాజు, భీమవరం మండల కార్యదర్శిగా బత్తిన మోహన్, నరసింహపురం గ్రామ అధ్యక్షులుగా అందుకూరి లావణ్యబాబును ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుండె నగేష్, మండలాధ్యక్షులు వర్దనపు మోషే పాల్గొన్నారు.

పంచాయతీ తీర్మానాలపై అభ్యంతరం



మోగల్లు పంచాయతీ పాలకవర్గ సమావేశం దృశ్యం

పాలకోడేరు: బిల్లుల చెల్లింపులో మోగల్లు పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు సభ్యులు ఆరోపించారు. మోగల్లు పంచాయతీ పాలకవర్గ సమావేశాన్ని సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ బోర్డు దృష్టికి తీసుకువచ్చిన పలు తీర్మానాలపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో సభ్యుల అనుమతి లేకుండా పూర్తి చేసిన పనులను సమావేశం దృష్టికి తీసుకురావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు సమావేశంలో ఉప సర్పంచ్ పెన్మత్స సీతారామరాజు సభ్యులు పెన్మత్స వెంకటరాజు, పెన్మత్స బలరాం కృష్ణంరాజు, బాలయ్య, బలే చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న సోమసుందర్

సాక్షి, భీమవరం: భీమవరంలో నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ కోస్తాంధ్ర జిల్లాల కార్యకర్తల మూడురోజుల రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజు సోమవారం బందెల నాసర్జీ, షేక్ మస్తాన్ అధ్యక్షవర్గంగా పలు రంగాల నిపుణులు కీలకోపన్యాసాలు చేశారు. ×రాజకీయ అర్థశాస్త్రం -మార్క్సిజం అనే అంశంపై డీవీవీఎస్ వర్మ, భారతదేశ చరిత్ర సంస్కృతి అనే అంశంపై డి.సోమసుందర్ బోధించారు. భారత దేశ స్వాతంత్ర్యోద్యమం-కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు చలసాని రామారావు వివరించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సీహెచ్ లక్ష్మారెడ్డి, కె.శివారెడ్డి, చింతలపూడి సునీల్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ సుందర్, టి అప్పలస్వామి పాల్గొన్నారు.

పెత్తందారులతో యుద్ధంలో పేదలకు అండగా జగన్

- పేదల ఇళ్ల స్థలాలపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆగ్రహం
- నిరసనగా భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు



ఉండిలో బైక్ ర్యాలీలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు



భీమవరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను చంద్రబాబు శ్మశానంతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం బైక్ ర్యాలీలు నిర్వహించి నిరసన తెలిపారు. భీమవరంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల బైకు ర్యాలీ మార్కెట్ యార్డ్ నుంచి ప్రకాశం చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా జువ్వలపాలెం రోడ్డు అద్దవంతెన వరకు సాగింది. జైజై జగన్, జై గ్రంధి, చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. ర్యాలీలో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, పార్టీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు గుడూరి ఉమాబాల, ఎంపీపీ పేరిచర్ల నరసింహరాజు మాట్లాడుతూ పెత్తందారులతో యుద్ధంలో పేదలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచి రక్షిస్తున్నారన్నారు. పేదలకు ప్రభుత్వం చేస్తున్న మేలు తట్టుకోలేక చంద్రబాబు పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను శ్మశానంతో పోల్చడం అతని నీచరాజకీయానికి నిదర్శనం అన్నారు. కుల, మత, వర్గం, పార్టీలకు అతీతంగా పేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి వారి సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేస్తున్నారన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న పాలనను చూసి తట్టుకోలేక నీచంగా మాట్లాడే స్థాయికి దిగజారిపోయిన చంద్రబాబును చూసి ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. చంద్రబాబుకు తోడుగా పేదలపై యుద్ధం చేయడానికి వస్తున్న పొత్తుల నాయకులు, పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీసీలు, ఎస్సీలను, మైనార్టీలను ఓట్ల కోసం ఉపయోగించుకున్న చంద్రబాబు వారి అభివృద్ధికి కోసం అతని పాలనలో చేసింది ఏమిలేదన్నారు. నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల, ఎస్సీలకు, మైనార్టీలకు ఒక పక్క సంక్షేమ ఫలాలు అందిస్తూ మరో పక్క వారిని రాజకీయంగా చైతన్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలపై చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాకపోతే ముందు ముందు ప్రజాగ్రహానికి గురికావడం ఖాయం అన్నారు. పెత్తందారులకు పేదలకు జరుగుతున్న యుద్ధంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టం చేశారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, బీసీ సంక్షేమం జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్, జేసీఎస్ కన్వీనర్లు నల్లం రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, గాదిరాజు తాతారాజు, రేవూరి గోగురాజు, చినమిల్లి వెంకట్రాయుడు, కొమటి రాంబాబు, గంటా సుందర్ కుమార్, బొక్కా గోపి, కోడే విజయలక్ష్మి, పాలవెల్లి మంగ, భూసారపు లక్ష్మీ, కోళ్ల బాలకృష్ణ, పాలపర్తి జోనా, తిరుమాని ధనుంజయ, పెచ్చేటి ప్రసాద్, చెల్లంకి గిరి, కొట్టి కుటుంబరావు, పేరిచర్ల సత్యనారాయణరాజు, మాదిరెడ్డి శ్రీను, నందమూరి ఆంజనేయులు, సాగి విజయకృష్ణంరాజు పాల్గొన్నారు.

పేదలు, పెత్తందారుల మధ్యే ఎన్నికలు

కాళ్ల: జరగబోయే ఎన్నికలు పేదలకు పెత్తందారులకు మధ్యేనని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పేదల ఇళ్ల స్థలాలపై చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ పీవీఎల్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సోమవారం పెదఅమిరం పార్టీ కార్యాలయం నుంచి నియోజకవర్గ స్థాయిలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ దమ్మున్న నాయకుడన్నారు. నవరత్నాల పథకాలు అమలు చేస్తూ ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చూసి టీడీపీ నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు నాయుడు పేదలకు ఒక సెంటు భూమి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. కానీ నేడు వైఎస్ జగన్ పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే దాన్ని కూడా రాజకీయం చేస్తూ చంద్రబాబు నీచమైన మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు తెరలేపారన్నారు. గతంలో కూడా ఇలాగే ఆరు వందల హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాడన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ, అదేవిధంగా సీఎం వైఎస్ జగన్ పాలన చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ కుటుంబ సభ్యులకు అందరికీ అభినందనలు తెలిపారు. ముందుగా పెదఅమిరం పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరిన బైక్ ర్యాలీ కాళ్ల, జువ్వలపాలెం ఏలురుపాడు మీదుగా ఆకివీడు మండలం నుంచి చెరుకువాడ ఉండి మండలం నుంచి తిరిగి పెదఅమిరం చేరుకుంది. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నియోజవర్గ స్థాయి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దొంగహామీలిచ్చి చంద్రబాబు మోసం చేశారు

ఉండి: వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, పేదల ఇళ్ల స్థలాలను స్మశానాలతో పోలుస్తూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన బైక్ ర్యాలీ ఉండి మండలం మీదుగా సాగింది. ర్యాలీలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు. ఉండి మండలంలోని చెరుకువాడ, కలిసిపూడి,ఉండి,ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ ఉండి సెంటర్‌కు చేరుకోగానే వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున పూలవర్షం కురిపించడంతో పాటు, బాణసంచా కాలుస్తూ జై జగన్, మళ్లీ సీఎం జగనే అంటూ నినాదాలు చేశారు. బైక్ ర్యాలీకి ఉండిలో అపూర్వస్వాగతం పలకడంతో వైఎస్సార్‌సీపీ కేడర్ ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ఎంతో నీతి నిజాయతీతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని పాలిస్తుంటే దుష్ట చతుష్టయం అడుగడుగునా అడ్డుపడుతోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే వాటిని స్మశాన భూమి అని మాట్లాడి పేదలపై చంద్రబాబు మరోసారి తన అక్కసు వెళ్లగక్కారని అన్నారు. ప్రజలు ఎంత ఛీకొట్టినా చంద్రబాబు, దత్తపుత్రుడికి బుద్ధిరావడం లేదన్నారు. అందుకే చంద్రబాబు దురాగతాలను మరోసారి ప్రజల ముందుకు తీసుకువెళ్లేందుకే బైక్ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. క్షత్రియ చైర్మన్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో సీఎం వైఎస్ జగన్ కంటే బాగా పరిపాలన చేసిన వారు మరెవ్వరూ లేరన్నారు. వైఎస్ జగన్ సంక్షేమ పాలనలో పేదలు బాగుపడితే చంద్రబాబు, దత్తపుత్రుడు వారి భజన బృందం చూడలేకపోతున్నారని, ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ, మహంకాళి, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, సర్పంచ్ కమతం సౌజన్య, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, కరిమెరక చంద్రరావు, యేడిద వెంకటేశ్వరరావు, గుండాబత్తుల సుబ్బారావు, బడుగు బాలాజీ, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీను,రాయి సతీష్, కొండవేటి సాంబశివరావు, గాంధీరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు దారుణం

ఆకివీడు: పేదలకు సెంటు భూమి ఇవ్వలేని చంద్రబాబు, పేదల కోసం కేటాయించిన స్థలాలను స్మశాన భూములుగా విమర్శించడం దారుణమని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన బైక్‌ర్యాలీ ఆకివీడు మీదుగా సాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడి హోదాను కూడా చంద్రబాబు భవిష్యత్‌లో కోల్పోవడం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, జీ.ధనరాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, నాయకులు శిరపు శ్రీనివాస్, మోరా జ్యోతి, అంబటి రమేష్, తిప్పా దుర్గాభవానీ, ఎండీ. జహంగీర్, ఎండీ.జక్కీ, సిద్దిక్, జామి శ్రీనివాస్, షేక్ హుస్సేన్, మెంటే లక్ష్మణరావు, సైదాల సూర్యనారాయణ, నందమూరి ప్రకాశం, మంతెన సీతారామరాజు, సాంబర్లిన్, గాలి సామ్రాజ్యం, కొట్టు మాణిక్యాలరావు, కురెళ్ల పోలు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో వాలంటీర్లు, కార్యకర్తలు, అభిమానులు పెద్దెత్తున ర్యాలీకి స్వాగతం పలికారు.

చంద్రబాబు దుర్బుద్ధి బయటపడింది

వీరవాసరం: బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలపై చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం వీరవాసరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్ల నిర్మాణాలకు పెద్ద ఎత్తున ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు తట్టుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చిన చంద్రబాబు దుర్బుద్ధి బయటపడిందని విమర్శించారు. ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించే పార్టీ ఒక వైఎస్సార్ సీపీ మాత్రమే అని గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు 600కు పైగా హామీలిచ్చి ఏ ఒక్క హామీ నెరవేర్చక ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. ముందుగా వీరవాసం రైల్వే స్టేషన్ నుంచి తూర్పు చెరువు సెంటర్ మీదుగా నందమూరి గరువు ఆంజనేయస్వామి ఆలయం వద్దకు మోటార్ వెహికల్ ర్యాలీని పెద్ద ఎత్తున నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు నూకల కనకారావు, వ్యవసాయ సలహా మండల చైర్మన్ గొలగాని సత్యనారాయణ, పోలిశెట్టి సత్యనారాయణ, గడ్డం భాస్కరరావు, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, మేకల కొండ, దాసరి మాణిక్యాలరావు, మతల కాశీ విశ్వేశ్వరరావు, భోగిరెడ్డి శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కాళ్లలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, హాజరైన పార్టీ నాయకులు



బైక్ ర్యాలీకి మాదివాడలో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు



వీరవాసరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



భీమవరంలో బైక్ ర్యాలీలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సంక్షేమ సారథులు వలంటీర్లు



పాలకోడేరు వలంటీర్లను సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

పాలకోడేరు: నిరంతరం అభివృద్ధిని ఆకాంక్షించే ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ సారథులుగా వలంటీర్లు సేవలందించడం అభినందనీయమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో కుముదువల్లి, గరగపర్రు, పాలకోడేరు గ్రామాల వలంటీర్లకు సోమవారం ఏర్పాటు చేసిన వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీరు క్లస్టర్‌లో ఉన్న ప్రజలకు పార్టీలకతీతంగా అర్హత ప్రామాణికంగా ఎటువంటి సిఫార్సు లేకుండా పథకాలు అందిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థతో పాటు వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలు సమస్యలు పరిష్కారానికి కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పని లేకుండా వలంటీర్ల సహకారంతో ఇంటి వద్దనే పరిష్కరించుకుంటున్నారన్నారు. పింఛను లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దనే పింఛన్ మొత్తాన్ని అందించడంతో సంతోషంగా ఉంటున్నారన్నారు. ప్రజలతో మమేకమై సేవలందిస్తున్న వలంటీర్లను మరింత ప్రోత్సహిస్తూ అవార్డులు ప్రకటించడం జరిగిందన్నారు. అనంతరం వలంటీర్లకు అవార్డులను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, సర్పంచ్‌లు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, ఇంజేటి మరియమ్మ, ఎంపీటీసీ సభ్యులు కొత్తపల్లి స్వాతి, షేక్ పాపాసాహెబ్, పాలాజ్యోతి, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీతులసి, జేసీఎస్ మండల కన్వీనర్ పాలా రాధాకృష్ణ, కటిక శ్రీదేవి, అంగరాజు సత్తిబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, గరగపర్రు అబ్బులు ఎంపీడీవో నూకల మురళీ గంగాధరరావు పాల్గొన్నారు.



దిరుసుమర్రులో వలంటీర్లను సత్కరించిన దృశ్యం

వలంటీర్లకు సత్కారం

భీమవరం అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థతో గ్రామాల్లో ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందుతున్నాయని దిరుసుమర్రు సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ అన్నారు. దిరుసుమర్రులో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులతో వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అవినీతి, అక్రమాలు లేకుండా ప్రతి ఇంటి ముంగిటికే ప్రభుత్వ పథకాల లబ్ధిని అందిస్తున్న ఘనత వలంటీర్లదేనని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏదైనా సంక్షేమ పథకానికి అర్హుడు కావాలంటే జన్మభూమి కమిటీ చుట్టూ తిరిగి వారికి కొంత సొమ్మును ముట్టుచెప్పుకోవాల్సి వస్తేనే కాని పనులయ్యేవి కావన్నారు. అంతేకాకుండా పంచాయతీ కార్యాలయాలు చుట్టూ లబ్ధిదారులు కాళ్లు అరిగేలా తిరిగేవారని గుర్తు చేశారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కేతా నాగమణి, కార్యదర్శి కృష్ణ మోహన్, రాజు, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థుల సహకారానికి సానా హామీ

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్, స్టార్టర్, ఇంటర్న్‌షిప్ అందించడంలో తమ వంతు సహకారం అందిస్తామని అమెరికాలోని న్యూజెర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల అల్యూమిని అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (సానా) సమ్మేళనంలో పాల్గొన్న తమ కళాశాల పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్‌వర్మ, ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు చెప్పారు. ఈ నెల 27న అమెరికాలోని కాలిఫోర్నియా, టెక్సాస్, ఫ్లోరిడా, డీసీ, అట్లాంట, బోస్టన్ ప్రాంతాల్లో ఉన్న కళాశాల పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున న్యూజెర్సీలో నిర్వహించిన సమావేశం వివరాలను సోమవారం భీమవరంలో విలేకరులకు వివరించారు. కళాశాల ప్రగతికి అల్యూమిని పేరు శాశ్వతంగా గుర్తుండి పోయేలా నిర్మాణం చేయడంతోపాటు విద్యార్థులకు తమ వంతు సహకారం అందిస్తామని విద్యార్థులు చెప్పారన్నారు. నిశాంత్ వర్మ మాట్లాడుతూ 43 ఏళ్ల చరిత్ర గలిగిన కళాశాల దేశంలో ప్రముఖ విద్యాసంస్థగా ప్రగతి సాధించిందని వివరించారు. అనంతరం అల్యూమిని ఆధ్వర్యంలో నిశాంతవర్మ, జగపతిరాజులతోపాటు రిటైర్డ్ ప్రిన్సిపల్ డి.రంగరాజు, గవర్నింగ్ బాడీ సభ్యుడు సాగి సత్యపతీ కవర్మ, జీఈ పద్మరాజు, డీఎస్ఎన్ రాజు, బాలకృష్ణ వర్మలను సత్కరించినట్లు చెప్పారు.

స్నేహబంధం.. ఎంత మధురం..



కాళ్ల హైస్కూల్లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కాళ్ల: ×స్నేహబంధము.. ఎంత మధురము.. చెరిగిపోదు.. తరిగిపోదు జీవితాంతము× అంటూ పూర్వ విద్యార్థులు ఓ చోట కలిసి ఉత్సాహంగా గడిపారు. మండల కేంద్రమైన కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 26 ఏళ్ల క్రితం చదివిన విద్యార్థులు అంతా ఒకచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. కుటుంబ సభ్యులతో హాజరు కావడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఆదుకోవాలని నిర్ణయించారు. మరొకసారి కలుద్దాం అంటూ ఒకరికొకరు ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన కోరుకొండ నాగేశ్వరరావు, పోతినీడి శ్రీనివాసు, కొనిశెట్టి సురేష్, చిత్తజల్లు గిరిబాబు, బావిశెట్టి కల్యాణ్ చక్రవర్తి, కుమారి, వనిత అభినందించారు.